సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



అడవి బిడ్డలం.. అభివృద్ధి కనం!

ఆదివాసీల జీవన ప్రమాణాల్లో నేటికీ మార్పు రావడంలేదు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 8లో▸



పల్లెల్లో స్వచ్ఛదనం-పచ్చదనం

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగుతోంది. అధికారులు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. విరివిగా మొక్కలు నాటిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'న్యాయవాదులపై దాడి హేయనీయం'



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాదులపై దాడి హేయనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేశ్ డిమాండ్ చేశారు. జనగామలో న్యాయవాదులు అమృతరావు, కవితపై జరిగిన దాడికి నిరసనగా గురువారం విధులు బహిష్కరించి అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాదుల కోసం రక్షణ చట్టాలు తీసుకురావాలని నినదించారు. దాడి చేసిన పోలీసులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంబడి సంతోష్, సభ్యులు రవీందర్, మల్లికార్జున్, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఆదిలాబాద్‌టౌన్: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని ఎస్పీ గౌస్ ఆలం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలు, పాఠశాలల్లో నూతనంగా వచ్చిన వారిపై ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని, ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎవరైనా తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులపై కేసు నమోదైతే భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు రావడం కష్టతరమని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర సమయంలో 'డయల్ 100'కు ఫోన్ చేయాలని, తక్షణమే పోలీసులు అక్కడికి చేరుకుంటారని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని విద్యాసంస్థల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోసం బీసీ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 1నుంచి నవంబర్ 30వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడ ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ద్వారా 100 మంది అభ్యర్థులకు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.4వేల చొప్పున స్టైఫండ్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 18–25 ఏళ్లలోపు ఎస్సెస్సీ, ఇంటర్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 8నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 08732 221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్యామలాదేవి

ఆదిలాబాద్‌రూరల్: 'స్వచ్ఛదనం–పచ్చదనం'లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో గిరిజనశాఖ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో నిహారిక, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కోఆర్డినేటర్ యాదవ్‌రావ్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: 'వాక్‌ఫర్ ఇన్నోవేషన్.. ఇంటింటా ఇన్నోవేటర్'లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరించి 15న ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చినవారికి ప్రశంసాపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్‌జాదవ్, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఇన్‌చార్జి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతక్క ఎందుకు రాలె..!



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క (ఫైల్)

- 'భట్టి' పర్యటనలో కనిపించని మంత్రి
- జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశం
- కారణంపై ఆరా తీస్తున్న కార్యకర్తలు
- నేతల మధ్య గ్యాప్ రావచ్చని చర్చ

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం బజార్‌హత్నూర్ మండలం పిప్రికి రాగా, ఈ పర్యటనలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క లేక పోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అది కూడా హస్తం పార్టీలోనే. నాయకులు, కార్యకర్తలు ఎవరు కలిసినా ప్రస్తుతం ఇప్పుడు ఇదే టాపిక్‌పై చర్చించుకుంటున్నారు. 'కారణం ఏమై ఉంటుందా..' అని ఆరా తీస్తున్నారు. సీతక్క పిప్రి సభకు గైర్హాజరుకు సంబంధించి ముందుగా ఏదైన సమాచారం ఇచ్చారా.. అంటే.. దీనిపై కూడా పార్టీ నాయకులెవరూ స్పష్టతనివ్వడంలేదు. అసలు ఈ పర్యటనకు మంత్రి సీతక్క ఎందుకు దూరంగా ఉన్నారంటే పార్టీ ముఖ్య నేతల నుంచి కూడా తెలియదనే సమాధానమే వస్తోంది.

పార్టీకి పెద్ద దిక్కుగా ఉండి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో గెలుపొందింది. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో విజయం సాధించింది. ఇక ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖానాపూర్‌లో మాత్రమే అధికార పార్టీకి ప్రాతినిధ్యం ఉంది. అక్కడ కూడా తొలిసారిగా ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు గెలిచారు. నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ, రెండింటిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపొందింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పెద్ద దిక్కుగా మారారు. ఆమె ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన నుంచి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకెళ్లినప్పటికీ పార్టీ గెలవకపోవడంతో ఆమెలో కొంత నిరాశ కనిపించింది. అయినప్పటికీ ఈ ప్రాంతంలో పార్టీ గడ్డు పరిస్థితుల దృష్ట్యా ఏ కష్టం వచ్చినా నాయకులు, కార్యకర్తలు సీతక్క వైపే చూసే పరిస్థితులున్నాయి. జిల్లాలో పార్టీ, ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా ఆమె ఆధ్వర్యంలోనే కొనసాగుతూ వస్తున్నాయి. ఇలా పార్టీని, ప్రభుత్వ వ్యవహారాలను ఆమె బాధ్యతగా నిర్వర్తిస్తూ వస్తున్నారు. ప్రతీ అంశంలో ఆమె డైరెక్షన్‌లోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతూ వస్తున్నాయి. ఇంతలా ఆధారపడి ఉండగా, ఏకంగా పిప్రిలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సభకు ఆమె దూరంగా ఉండటమే ఇప్పుడు చర్చకు కారణమైంది.

ఏదైన ముఖ్యమైన పనిలో ఉండి మంత్రి సీతక్క ఈ సభకు రాలేకపోయారేమో.. అని అందరూ భావించారు. అయితే బుధవారం ఆమె హైదరాబాద్‌లోనే ఉన్నారని, వివిధ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారని పార్టీ వాళ్లే చెప్పుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కావాలనే ఈ సభకు దూరంగా ఉన్నారా..? లేనిపక్షంలో ప్రత్యేక కారణాలు ఏమై ఉంటాయా? అని కార్యకర్తల్లో సంశయం వ్యక్తమవుతోంది. కాగా, సభలోనూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రస్తావన కూడా రాలేదు. ఆమె గైర్హాజరుపై ఎవరైన నేతలు కారణం వెల్లడిస్తారా.. అంటే అదీ లేదు. దీంతో పార్టీలో ఏదైన గ్యాప్ ఏర్పడిందేమో.. అనే సందిగ్ధం ముఖ్య నాయకులు, కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కాగా, భట్టి కార్యక్రమానికి సంబంధించి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఏర్పాట్లన్నీ పర్యవేక్షించారని పార్టీలో చెప్పుకొంటున్నారు. అంతే కాకుండా పీఎస్సార్ వర్గానికి చెందిన నాయకులకు ఈ పర్యటనలో ప్రాధాన్యం దక్కిందనే చర్చ సాగుతోంది. ప్రస్తుతం పార్టీలో ఈ వ్యవహారం ప్రాధాన్యతను సంతరించుకుంది.

పార్టీలో గ్యాప్ ఏర్పడిందా..?

కనువిందు చేస్తున్న 'పెద్దగుండం'



ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ సమీప దట్టమైన అటవీ ప్రాంతంలోగల పెద్దగుండం జలపాతం పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటోంది. రెండుకొండల మధ్య నుంచి పాల ధారలలాగా జాలువారుతోంది. కోకస్‌మన్నూర్ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగుపై సహజసిద్ధంగా ఏర్పడింది. జలపాతం వద్ద లోతైన గుండంలో నీటి ధారలు పడుతుండగా.. దీని గుండా ప్రవహించే నీరు కడెం వాగులో కలుస్తుంది. – ఇచ్చోడ

నిల్వ నీటితోనే వ్యాధులు



నిల్వ నీటిని పరిశీలిస్తున్న నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: నిల్వ నీటితో వ్యాధులు ప్రబలుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా చెరువులో గంబూషియా చేపలు వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టడంతో వాటి వృద్ధి పెరుగుతుందని తెలిపారు. దోమలతో డెంగీ, మలేరియా వ్యాధులు సోకుతాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని పేర్కొన్నారు. అనంతరం కాలనీల్లో పర్యటించిన ఆయన కూలర్లు, కుండీలు, తదితర వాటిలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. భుక్తాపూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఖానాపూర్ యూపీఎస్ పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కౌన్సిలర్ ప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మలేరియా నివారణాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కలపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి కలవేని శంకర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు, కార్మిక, కర్షకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా ఉద్యమాలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కుంటాల రాములు, అర్ధాంగి రమేశ్, గణేశ్, అమీనా బేగం, షేక్ పాషా, పాచ్చిరాం, బెజ్జంకి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

'కుప్టి ప్రాజెక్ట్ వద్దు'

నేరడిగొండ: మండలంలోని కడెం వాగుపై కుప్టి గ్రామం వద్ద నిర్మించతలపెట్టిన ప్రాజెక్ట్ మాకొద్దని కుప్టి(కె) గ్రామస్తులు గురువారం గ్రామానికి వచ్చిన తహసీల్దార్ ఎంఏ కలీమ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమ గ్రామం పూర్తిగా ముంపునకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్టిని ముంపు గ్రామంగా ప్రకటించాకే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడతామని తహసీల్దార్ తెలిపారు. వీడీసీ అధ్యక్షుడు నవీన్‌చారి, గ్రామ పెద్దలు బాద వెంకటరమణ, మెట్టు శ్రీధర్, బొమ్మెన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు →



వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

ఆదిలాబాద్‌రూరల్: వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ శివారు ప్రాంతంలోగల 2వ పోలీస్ బెటాలియన్‌లో విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. అనంతరం పచ్చదనం, ఆరోగ్యకర భవిష్యత్ కోసం సమష్టి కృషిని సూచిస్తూ మరిన్ని మొక్కలు నాటుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు కమాండెంట్ నితిక పంత్ మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఎస్పీ గౌస్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, అసిస్టెంట్ కమాండెంట్ దేవిదాస్ రాథోడ్, ఏజేపీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ, కమాండెంట్

గ్రామాల ప్రగతిలో ఎస్‌హెచ్‌జీలు కీలకం



అధికారులతో కలిసి మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గ్రామాల ప్రగతిలో ఎస్‌హెచ్‌జీ సభ్యుల పాత్ర కీలకమని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మహిళా వికాస జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనంపై అవగాహన కల్పిస్తూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. విద్య, గ్రామాలాభివృద్ధి, స్త్రీల బ్యాంక్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. డీఆర్డీవో సాయన్న, ఏపీడీ నీలయ్య, ఏవో గంగాధర్, డీపీఎంలు హేమలత, గంగన్న, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వనజ, ప్రేమల తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు చేయాలి

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. వేడుకల నిర్వహణపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా ప్రగతి నివేదిక రూపొందించాలన్నారు. శకటాలు, వివిధ స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగుల ప్రతిపాదనలు గడువులోపు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఏవో రాంరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

జైనథ్: మండలంలోని కాన్పు మేడిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు జెడ్పీ హైస్కూల్‌కు కిచెన్ షెడ్ మంజూరు చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సాత్నాల ప్రాజెక్ట్ కింద పలు మొక్కలు నాటారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే, నారాయణ తదితరులున్నారు.

బడులు బాగు చేశారు!

- ఎస్‌హెచ్‌జీ సభ్యుల పనితీరు భేష్
- మౌలికవసతుల కల్పనలో సక్సెస్
- పాఠశాలల్లో పనులు దాదాపు పూర్తి
- ఆదర్శంగా అమ్మ ఆదర్శ కమిటీలు



ఆదిలాబాద్ పట్టణంలోని బాలక్ మందిర్ పాఠశాల

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్చి రెండో వారంలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు ప్రారంభించింది. గతంలో పనులు కాంట్రాక్టర్లు, ఎస్‌ఎంసీలు చేయగా నత్తనడకన సాగాయి. మన ఊరు–మన బడి ద్వారా జిల్లాలో చేపట్టిన పనులు వెనుకంజలో ఉన్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు ప్రాధాన్యమిచ్చింది. ఎస్‌హెచ్‌జీల ద్వారా పాఠశాలల్లో పనులు చేపట్టారు. జూలై చివరి వరకు దాదాపు అన్ని పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులు తొలగినట్లు పేర్కొంటున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులు, బాలికల కోసం నూతన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుద్దీకరణ, మేజర్, మైనర్ రిపేర్లు పూర్తి చేశారు.


జిల్లాలో 649 పాఠశాలల్లో..

జిల్లా విద్యాశాఖాధికారి పరిధిలో 678 ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలలున్నాయి. వీటిలో పదింటిలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉండగా, 16 పాఠశాలల్లో మన ఊరు–మన బడి ద్వారా పనులు చేపట్టారు. మూడు పాఠశాలలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో పనులు చేపట్టలేదు. అయితే 649 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేపట్టారు. ఇందులో 645 పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.23.24 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు రూ.8 కోట్లు విడుదల చేసింది. ఎంబీ రికార్డులు పూర్తయిన తర్వాత నిధులు విడుదలవుతాయని అధికారులు చెబుతున్నారు.

మన ఊరు–మన బడి ద్వారా..

గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి ద్వారా జిల్లాలో 237 పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం పనులు చేపట్టారు. ఇందులో 16 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. రెండేళ్ల కాలంలో పనులు నత్తనడకన సాగాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.89 కోట్లు కేటాయించింది. రూ.25 కోట్లు విడుదల చేసింది. రూ.8.5 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ ఆ పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని ద్వారా తాగునీరు, విద్యుద్దీకరణ, మేజర్, మైనర్ పనులు, నూతన తరగతి గదుల నిర్మాణం, డైనింగ్ హాళ్ల పనులు జరిగాయి. ఈజీఎస్ కింద ప్రహరీలు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. సీసీఎం కంపోనెంట్స్ కింద పాఠశాలలకు పెయింటింగ్, డ్యూయల్ డెస్క్, బోర్డులు, ఆఫీస్ ఫర్నిచర్ సమకూర్చారు. అయినా 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి సారించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.

645 పాఠశాలల్లో పనులు పూర్తి



అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని 649 పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు చేపట్టారు. 645 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.23.24 కోట్లు కేటాయించింది. మిగతా పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పనులు త్వరగా చేపట్టేలా చూశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. – జే నారాయణ, సెక్టోరియల్ అధికారి, విద్యాశాఖ

హామీలు అమలు చేయాలి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగన్‌సింగ్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను గడువులోపు అమలు చేయాలని కోరారు. ఆంక్షలు లేకుండా ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీని అర్హులైన ప్రతీ రైతుకు వర్తింపజేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు జారీ చేసి సాగు హక్కులు కల్పించాలని కోరారు. అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు అందించాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుమ్ర అశోక్, ఉమ్రే సచిన్, సురేశ్, వసంత్‌రావు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

చిరుత దాడిలో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

బోథ్: మండలంలోని చింతల్‌బోరి శివారు ప్రాంతంలో చిరుత దాడిలో ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుధవారం పార్డి బిలో రైతు తొడసం సీతారాంకు చెందిన ఆవు చింతలబోరి గ్రామ శివారులోని అడవిలో మేత మేస్తుండగా చిరుతపులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భయాందోళన చెందిన పశువుల కాపరి అక్కడినుంచి పారిపోయి రైతుకు సమాచారం అందించాడు. వృద్ధులు, పశువులు, మేకలు, గొర్రెల కాపరులు దట్టమైన అడవుల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు



భోజనంలో వచ్చిన పురుగులు

బోథ్: మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులు తినే ఆహారంలో పురుగుల వచ్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు గురువారం మధ్యాహ్నం భోజనం చేయడానికి హాస్టల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో భోజనం చేస్తున్నప్పుడు ఆహారంలో పురుగులు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఒకరి అదృశ్యం



సతీష్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(కే)గ్రామానికి చెందిన గుంజ సతీష్ అదృశ్యమైనట్లు ఎస్సై వి.రజినీకాంత్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని సుభాష్ నగర్‌కు చెందిన సతీష్ బతుకు దెరువు కోసం కుంటాల మండలంలోని లింబా(కే) గ్రామానికి భార్యతో కలిసివచ్చి వడ్డెర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న భార్యతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం అతని భార్య ఉమ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

- గిరిజన గూడేల్లో కానరాని మౌలిక వసతులు
- తాగునీటికి తప్పని తండ్లాట
- విద్య, వైద్యపరంగానూ వెనుకబాటు
- హక్కుల కోసం ఆగని అడవిబిడ్డల ఆక్రందన
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

వాగులోని నీటిని తీసుకెళ్తున్న నార్నూర్ మండలంలోని బొజ్జగూడ గ్రామ మహిళలు



అడవి బిడ్డలం.. అభివృద్ధి కనం!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వివరాలు
ఐటీడీఏ పరిధిలోని మండలాలు : 77
ఆదివాసీ గిరిజన కుటుంబాలు: 67,648
ఆదివాసీ గిరిజన జనాభా: 4,84,790

కైలాస్‌నగర్: అడవిలో పుట్టి... అడవిలో పెరిగి.. అడవితల్లి ఒడిలోనే సాగుతున్న వైవిధ్యమైన జీవన ప్రయాణం. రోజురోజుకు సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్నా తమ ఆచార వ్యవహారాలను పదిలపర్చుకుంటూ కొండకోనల నడుమ ప్రకృతి తో మమేకమై జీవనం సాగించే అమాయకత్వం ఆదివాసీల సొంతం. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 76 పూర్తికావచ్చినా ఆదివాసీల జిల్లాగా ముద్రపడిన ఆదిలాబాద్ జిల్లాలోని అడవిబిడ్డల జీవన ప్రమాణాల్లో మాత్రం మార్పురావడం లేదు. ఇప్పటికీ తాగునీటికి తీవ్ర తండ్లాట నెలకొనగా విద్య, వైద్యపరంగా వెనుకబాటు తప్పడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ హక్కులు, అస్తిత్వం కోసం అడవిబిడ్డలు చేస్తున్న ఆక్రందన మాత్రం ఆగడం లేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9ని 'అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం'గా ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీల ఆచార వ్యవహారాలు, జీవన శైలిపై 'సాక్షి' అందిస్తున్న కథనం...

ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇబ్బంది

ఆదివాసీలకు విద్యపరంగా వెనుకబాటు తప్పడం లేదు. గిరిజనులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఏళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడంతో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సీఆర్టీలతోనే బోధన సాగిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ చదువుకునే పరిస్థితులు అందుబాటులోకి రాలేదు. టీటీసీ, ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రాలను ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలు రూపొందించినా అమలుకు నోచుకోవడంలేదు. ఐటీడీఏ పరిధిలోని డీఎడ్ కళాశాలను మూసివేశారు. ఉట్నూర్ కేంద్రంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీని ఇతర జిల్లాకు తరలించడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయమే జరిగింది. ఉన్నత విద్యావకాశాలు లేక ఆదివాసీలు నష్టపోవాల్సి వస్తోంది.

వర్షాకాలం... కష్టాలమయం

ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గూడేల్లో నివసించే ఆదివాసీలకు వర్షాకాలం కష్టకాలమనే చెప్పుకోవాలి. 170కు పైగా గూడేలకు ఇప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు రవాణా వ్యవస్థ వంటి సౌకర్యాలు లేవు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగి రోజుల తరబడి బాహ్య ప్రపంచానికి దూరం కావాల్సిన దుస్థితి నెలకొంది. వాగులు దాటుతూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. సరైన రోడ్లు లేకపోవడం, ఉన్న రోడ్లు బురదమయంగా మారడంతో అత్యవసర పరిస్థితుల్లో గూడేలకు 108, 104, 102 వాహనాలు కూడా రాలేని దుస్థితి. ప్రాణాల మీదకు వస్తే ఎడ్లబండ్లు, మంచాలపై రోగులను వేసుకుని వాగులను దాటించి తీసుకెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో గర్భిణులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉమ్మడి జిల్లాలో వరద కష్టాలకు వాగులు, వంకలు దాటలేక వైద్యం అందక 45 మంది గర్భిణులు, 32 మంది నవజాత శిశువులు, 17 మంది బాలింతలు చనిపోయారు. రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. పలు ఆదివాసీ గ్రామాల్లోనూ ఇప్పటికీ కరెంట్ వసతి లేకపోవడంతో అంధకారంలోనే కాలం వెల్లదీస్తున్నారు.



రోడ్డును బాగుచేసుకుంటున్న భీంపూర్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామస్తులు

వేసవిలో చెలిమే నీరే దిక్కు

వేసవికాలం వచ్చిందంటే ఆదివాసీలు తాగునీటికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఇంటింటికీ శుద్ధ జలం అందిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా ఇప్పటికీ అనేక గ్రామాలకు తాగునీరు అందడం లేదు. ఫలితంగా కిలో మీటర్ల దూరంలో ఉన్న చేదబావులు, వాగుల్లోని చెలిమెల నుంచే ఎడ్లబండిపై డ్రమ్ములు కట్టి, నెత్తిన బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని గిరిజన గూడేల్లో ఈ దుస్థితి మరింత ఎక్కువగా ఉంది.

ఆగని అడవిబిడ్డల ఆక్రందన

జల్..జంగల్ ..జమీన్ నినాదంతో సాగిన భూపోరాటం స్ఫూర్తిగా ఆదివాసీలు ఏళ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. 1/70, పెసా చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు భూములపై సర్వహక్కులు ఉంటాయి. ఆర్ ఓఎఫ్ఆర్–2006 చట్టం ప్రకారం భూములను సాగు చేస్తున్న ఆదివాసీలకు ప్రభుత్వం హక్కుపత్రాలు అందించినప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో తమపై అటవీ అధికారుల వేధింపులు పెరిగాయని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు.

సిరికొండ మండలంలోని కుంటగూడ, పాలవాగు గ్రామాలకు వెళ్లే రోడ్డు దుస్థితి



రోడ్డు సౌకర్యంలేక బాలింతను వాగు దాటిస్తున్న వైద్యసిబ్బంది



అధికారుల వేధింపులు ఆపాలి



ప్రభుత్వం ఆర్ వోఎఫ్ఆర్ కింద గిరిజనులకు హక్కుపత్రాలు ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. పలు పత్రాల్లోనూ పొరపాట్లు జరగడంతో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు పొందలేకపోతున్నారు. ముఖ్యంగా అటవీ అధికారుల వేధింపుల నుంచి గిరిజనులను కాపాడాలి. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి.

– గోడం గణేశ్, తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు

ఆదివాసీల అభ్యున్నతికి కృషి



ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టాం. దాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. బైక్ అంబులెన్స్‌లను త్వరలో ప్రారంభిస్తాం. హైమన్‌డార్ఫ్ కోచింగ్ సెంటర్‌లో నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

ప్రణాళికతోనే పట్టపగలు చోరీ

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

సారంగపూర్: మండలంలోని బీరవెల్లికి చెందిన ఒన్నె సుధాకర్ ఇంట్లో ప్రణాళికతోనే పట్టపగలు చోరీ జరిగిందని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బీరవెల్లి గ్రామానికి చెందిన ఒన్నె సుధాకర్ ఈ నెల 2న గొర్రెలు మేపేందుకు వెళ్లగా అతని భార్య లక్ష్మి వ్యవసాయ పనుల నిమిత్తం పంటపొలానికి వెళ్లింది. సమీపంలో నివాసం ఉంటున్న ఇప్ప పరమేశ్వర్ పక్కా ప్రణాళికతో ఇంటి తాళాన్ని రాయితో పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. బీరువా తెరిచి అందులో దాచి ఉంచిన 7తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్షా యాభైవేల నగదు అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్ ఆధారాలు సేకరించారు. గురువారం బీరవెల్లి గ్రామానికి పరమేశ్వర్ వచ్చినట్లు సెల్‌ఫోన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పంటపొలంలో పడి వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు పంటపొలంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాచాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చిట్యాల అశోక్ (52) తన చిన్న కుమారుడికి మధ్యాహ్నం భోజనం ఇచ్చేందుకు నర్సాపూర్ గ్రామ శివారులోని పంట పొలం వద్దకు వెళ్లి తిరిగి పొలం గట్టుపై నుండి నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పొలంలో పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుని భార్య భీమవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సుమలత

కాపర్ వైర్లు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో నుంచి కాపర్ వైర్లు, అల్యూమినియం, ఆయిల్‌ను దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బోథ్ గ్రామానికి చెందిన ఇప్ప బలరాం, పరమేశ్వర్, ఆదిలాబాద్‌కు చెందిన మిర్యాల శ్రీకాంత్ కొన్నినెలల క్రితం బతుకుదెరువు కోసం సారంగాపూర్ మండలంలోని బీరవెల్లికి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటుపడి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైరు, ఆయిల్ దొంగిలించేవారు. ఈ నెల 6న నిర్మల్ పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను విప్పి అందులోంచి కాపర్‌వైరు, ఆయిల్ దొంగిలించారు. ఇప్ప బలరాం ఈ నెల 8న వాటిని విక్రయించేందుకు సంచిలో పెట్టుకుని స్థానిక గాంధీ చౌక్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా బుధవార్ పేట్ చౌరస్తా వద్ద పోలీసులను చూసి భయపడి పరిగెత్తాడు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి 21 కిలోల 500 గ్రాముల రాగి తీగ, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాల శ్రీకాంత్ పరారీలో ఉండగా, ఇప్ప పరమేశ్వర్ మరో కేసులో అరెస్ట్ అయ్యాడు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై అశోక్‌ను డీఎస్పీ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం గ్రామ సమీపంలో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఆయనపేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జ్వరంతో యువతి మృతి



జ్యోతి (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో యువతి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని తుమ్మగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపి న వివరాల మేరకు గ్రామానికి చెందిన కోట్నాక్ భీంరావ్, కళాబాయి దంపతుల కుమార్తె జ్యోతి (20) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా రక్త పరీక్షలు నిర్వహించి సాధారణ జ్వరంతోపాటు టైఫాయిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. రోజూ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా గురువారం జ్వరతీవ్రత పెరిగింది. 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. యువతి మృతితో తుమ్మగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బజార్‌హత్నూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో నానక్‌సింగ్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రకు చెందిన సురేష్ శిరజోర్ చౌహన్ (29) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బలన్‌పూర్ గ్రామ సమీపంలో కుక్కలను తప్పించబోయి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

బాసర: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బామ్మ రావుల్లా గంగు అనే ఓ వృద్ధురాలు గురువారం బాసర వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి గోదావరి నదిలో దూకేందుకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు వృద్ధురాలిని కాపాడారు. నిజామాబాద్ జిల్లా జాన్కంపేట్ వెళ్తానని చెప్పడంతో తలాకొంత డబ్బులు జమచేసి వృద్ధురాలిని బస్సులో పంపించారు.

పంచమికి పిల్లలను పంపించండి..!



గేటు బయట నిరీక్షిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



గేటు వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

- భైంసా ఆశ్రమ బాలికల పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరీక్షణ

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు గురువారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా చేరుకున్నారు. ఎందుకని ఆరా తీస్తే తమ పిల్లలను నాగుల పంచమికి ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చామని చెప్పారు. అయితే పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలను ఇంటికి పంపించడం లేదని వాపోయారు. దాదాపు రెండు, మూడు గంటల పాటు పాఠశాల గేటు బయటే వేచి ఉన్నారు. ఎంతకూ ఉపాధ్యాయులు పిల్లలను పంపించకపోవడంతో అక్కడే నిరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు సర్దిచెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు. ఈ విషయమై హెచ్‌ఎం స్వర్ణమంజులను 'సాక్షి' వివరణ కోరగా శుక్రవారం పాఠశాలలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఆదేశాలున్నాయని, ఈ నేపథ్యంలో విద్యార్థులను ఇంటికి పంపించాలని తమకు ఆదేశాలు లేవన్నారు.

11 దాటినా.. పాఠశాలలు తెరవలే!





ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో జిల్లాలోని కొన్ని మారుమూల ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలల (టీడబ్ల్యూపీఎస్) ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. గురువారం పదకొండు దాటినా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మొలాల గుట్ట, సాలాయిగూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు తెరుచుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. విద్యార్థులు ఆ సమయంలో ఆడుకుంటూ కనిపించారు. దీంతో గిరిజన విద్యార్థులకు చదువు అందక నష్టపోతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

66 మందికి ఒకే ఉపాధ్యాయుడు



నిర్మల్ జిల్లా కేంద్రం శాంతినగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 66 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కానీ వారందరికీ పాఠాలు బోధిస్తున్నది మాత్రం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌గౌడ్. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా ఇటీవల బదిలీల్లో భాగంగా ఒకరికి పదోన్నతి వచ్చి వెళ్లిపోయారు. దీంతో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడే ఐదు తరగతుల విద్యార్థులకు అన్నిసబ్జెక్టులు బోధిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా దరిచేరుతుందో విద్యాశాఖ అధికారులకే తెలియాలి మరి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్